క్లుప్తంగా

సొదాగర్ కుంచె నుంచి బాబాసాహెబ్



సొదాగర్ గీసిన అంబేద్కర్ చిత్రం



ఇందుగమెల్లి సొదాగర్

రాయవరం: ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీం రావ్ రాంజీ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రాన్ని కళాకారుడు ఇందుగమెల్లి సొదాగర్ గీశారు. భారత దేశ తొలి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి, అంటరానితనం, కుల రక్కసిపై ఉక్కుపాదం మోపిన సంఘ సంస్కర్త, ప్రముఖ న్యాయవాది అంబేద్కర్ అని సొదాగర్ అన్నారు. జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరిస్తూ ఈ చిత్రాన్ని గీసినట్టు విలేకర్లకు తెలిపారు.

వేగంగా శ్మశానవాటిక పునాది పనులు



కోరుమిల్లిలో శ్మశానవాటిక పునాది నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి శ్మశానవాటిక పునాది నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే పంచాయతీ నిధులతో బోరు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పుష్కరఘాట్ సమీపంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక అంత్యక్రియలు, కర్మకాండల ప్రక్రియలకు అనువుగా ఉండనుంది.

నేటి నుంచి గ్రామ సభలు

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాలపై ఆదివారం నుంచి అధికారులు గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఏడాదిలో నాలుగు సాధారణ గ్రామసభలను నిర్వహించవలసి ఉన్న నేపథ్యంలో ఈ గ్రామ సభలకు ఆదేశాలిచ్చారు. ఏటా జనవరి 26, ఏప్రిల్ 14, జూలై 01, అక్టోబర్ 03 తేదీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కోడ్ పరిధిలోనే పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలను నిర్వహిస్తారు. మండలంలోని 19 గ్రామాల్లో వారం లోగా గ్రామసభలను పూర్తి చేయనున్నట్టు ఎంపీడీఓ ఎం.కొండలరావు తెలిపారు. ఆయా సర్పంచ్‌లు గ్రామసభలకు అధ్యక్షత వహించనుండగా సభలో ఎలాంటి రాజకీయపరమైన అంశాలను చర్చకు తీసుకు రాకూడదని ఆదేశాలున్నాయి. పార్టీలకు సంబంధించిన చిహ్నాలు, జెండాలు లేకుండా సభను నిర్వహించనున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసిన శ్రీభీమ షిరిడీ సాయి బాబా ఆలయ 28వ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్త సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతుల చేతుల మీదుగా శనివారం ఘనంగా నిర్వహించారు. కాకడ హారతి, క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సుమారు 2 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ద్రాక్షారామ, వెలంపాలెం గ్రామాల్లో రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోతంశెట్టి రాంబాబు, కార్యదర్శి కొమ్మిశెట్టి బాబు, కమిటీ సభ్యులు కేఎస్ పాపాజీ, మేకా కుమార్, పేరూరి వీర్రాజు, ఆళ్ల భీమశంకరం ఏర్పాట్లు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన 'శశి'



మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో 'శశి' అధ్యాపక బృందం

మండపేట: స్థానిక శశి జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శనివారం తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో మహాదేవపట్నం నవ్యశ్రీ 1000కి 990 మార్కులు, బైపీసీలో కొప్పిశెట్టి శ్రీహాసిని 1000 మార్కులకు 984 మార్కులు సాధించారని చెప్పారు. ఇక ఫస్టియర్ ఎంపీసీలో మండా లీలాకృష్ణారెడ్డి 470 మార్కులకు 466 మార్కులు సాధించాడన్నారు. వారిని ఆ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ లక్ష్మీసుప్రియ అభినందించారు.

పశువుల్లో వ్యాధులపై అప్రమత్తం

- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- రామచంద్రపురం పశు వైద్యాధికారి డాక్టర్ కృష్ణార్జున



వేసవి తాపానికి చెరువులో సేదతీరుతున్న పశువులు

రామచంద్రపురం రూరల్: ఎండలు మండుతున్నాయి. వేసవిలో పశువులకు అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పశువులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా టీకాలు వేయిస్తే ఇంకా మంచిదని రామచంద్రపురం మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పశువుల పోషకులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

జబ్బవ్యాధి

మూడేళ్లు పైబడి బలిష్టంగా ఉన్న ఎడ్లలో జబ్బ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. జబ్బ వాస్తుంది. మేత తినవు, ఈ వ్యాధి రాకుండా ఏటా బిక్యూవ్యాక్సిన్ వేయించాలి.

గొంతువాపు వ్యాధి

ఈ వ్యాధి గేదె జాతుల్లో వస్తుంది. గొంతు బాగా వాస్తుంది. కంటి నుంచి నీరు కారుతుంటుంది. 106 డిగ్రీల జ్వరం వస్తుంది. ఇది అంటువ్యాధి. ఒక పశువు నుంచి మరో పశువుకు సోకుతుంది. ఈ వ్యాధి వచ్చిన వెంటనే సమీపంలో ఉన్న పశువైద్యాధికారుల వద్దకు తీసుకువెళితే హెచ్ఎస్ వ్యాక్సిన్ వేస్తారు.

గాలికుంటు వ్యాధి

ఈ వ్యాధి సోకిన పశువుల పెదవులకు పొక్కులు, కురుపులు వస్తాయి. జ్వరం 100 డిగ్రీలు ఉంటుంది. పశువులు చనిపోవు కానీ పాల దిగుబడి తగ్గిపోతుంది. ఈ వ్యాధి సోకకుండా ఏడాదికి రెండుసార్లు పశువైద్యశాలకు తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించాలి.

పాలజ్వరం

పాడి పశువులు ఈనిన తరువాత పాలజ్వరం బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధిపై రైతులకు అవగాహన తప్పనిసరి. పాలజ్వరం అంటే పాడి పశువు జ్వరంతో బాధపడటమేనని రైతులు భావిస్తారు. కానీ, అది సరికాదు, ఆరోగ్యవంతమైన పశువు శరీర ఉష్ణోగ్రత 101.4 డిగ్రీలు ఉంటుంది. పాలజ్వరం వచ్చిన పశువు శరీర ఉష్ణోగ్రత 97 నుంచి 99 డిగ్రీలకు తగ్గిపోతుంది. ఈ వ్యాధి ఎక్కువగా ఆవులు, గేదెలు ఈనిన వారంలోపు అధిక పాలదిగు బడినిచ్చే పశువుల్లో కనిపిస్తుంది. పొదుగులో ఉన్న మొత్తం పాలు పితకడం వల్ల పాలజ్వరం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

జున్నుపాలు

సాధారణ పాలల్లో ఎక్కువ శాతం కాల్షియం నష్టపోయి ఈ జ్వరం బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధి వచ్చిన పశువులు తల, మెడ ఒకవైపుకు తిరిగి తలను డొక్కలో పెట్టుకుని పడుకుంటాయి. నీరసంతో లేవలేవు. మేత మేయక శరీరం చల్లగా ఉంటుంది. ఒక్కోసారి పైకి లేవాలని ప్రయత్నించి కింద పడిపోతాయి. తన్నుకోవడం, కండరాల్లో వణుకు స్పష్టంగా కనిపిస్తుంది. కళ్ల నుంచి నీరుకారుతూ చెవులు వాలిపోయి ఉంటాయి. పశువు చిరాగ్గా ఉండి తరచూ ఉలిక్కి పడుతుంటుంది.

నివారణ మార్గం



ఈ వ్యాధి నివారణకు పొదుగు నుంచి మొత్తం పాలు పితకకూడదు. చూడితో ఉన్న సమయంలో సమీకృత ఆహారం అందించాలి. పశువైద్యుని సలహా మేరకు చూడితో ఉన్నప్పుడు ఈనిన తర్వాత కాల్షియం, మెగ్నీషియం మందులు వాడాలి. చూడితో ఉన్నప్పటి నుంచి ఖనిజ లవణాలను రోజుకు 30 నుంచి 50 గ్రాముల దాణాతో కలిపి వాడాలి. పాలజ్వరం వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కాల్షియం, మెగ్నీషియం మందును నరాల ద్వారా రక్తంలోకి వైద్యుని పర్యవేక్షణలో ఎక్కించాలి. పశువుకు విశ్రాంతి తప్పనిసరి.

– డాక్టర్ ఎం.కృష్ణార్జున, పశు వైద్యాధికారి, రామచంద్రపురం

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: చిన్నారుల దంత సమస్యలకు కారణమయ్యే ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఆరోగ్య కార్యకర్తలు అన్నారు. మండలంలోని పడమర ఖండ్రికలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో శనివారం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో ఫ్లోరోసిస్ సమస్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ దేవి, వైద్య ఆరోగ్య కార్యకర్త చెల్లుబోయిన బేబీ మాట్లాడుతూ చిన్నారుల పన్ను రంగుమారడం ద్వారా ఫ్లోరోసిస్ సమస్యను గుర్తించవచ్చన్నారు. సమస్య తీవ్రమవ్వడం ద్వారా పన్ను రంగు మరింత మారుతుందని, బలహీనపడే సమస్య ఉందన్నారు. టూత్ పేస్టు అధికంగా వాడటమూ, బ్లాక్ టీ తాగడం తదితర కారణాలతో సమస్య తలెత్తుతుందన్నారు. ఫ్లోరిన్ ప్రభావాలపై ప్రభుత్వం సమకూర్చిన పరికరాలతో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం టీడీపీని వీడి..నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పార్టీలు చూడకుండా, కుల, మతాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అందుకే రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రతిపక్షం అనేదే లేకుండా ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని వారికి మాటిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నేదూరి జగ్జీవన్‌రావు, బిక్కిన సురేష్, నేదూరు పద్మనాభం, కాండ్రకోట దుర్గారావు, మందపల్లి దొరబాబు, కాకర్ల శ్రీను, దొంగ మహాలక్ష్మి, కాకర్ల శ్రీను, సాదే అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.

ఆవాలతో అంబేడ్కర్ చిత్రపటం



ఆవాలతో రూపొందించిన అంబేద్కర్ చిత్రంతో వేణుబాబు, రనీత్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రాన్ని ఆవాలతో రూపొందించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పెయ్యల వేణుబాబు, గంటి రనీత్‌లు తమ తల్లులు వంటల్లో ఉపయోగించే ఆవాలతో అంబేద్కర్ చిత్రాన్ని పాఠశాల డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ సూచనలతో రూపొందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, మల్లేశ్వరి, మహాలక్ష్మి తదితర ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

మంచి అనుబంధం కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ప్రభాకరరావు

రామచంద్రపురం: కోర్టు బెంచ్‌కు, బార్ అసోసియేషన్‌కు న్యాయవాదులు మంచి అనుబంధం కలిగి ఉండాలని, కోర్టులోను న్యాయవాదులతోను ఎంతో సమన్వయంతో పనిచేసి అందరికి మార్గదర్శకంగా నిలిచిన ఎస్ఆర్‌టీ సేవలు మరువలేనివని రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది చింతపెంట ప్రభాకరరావు అన్నారు. బార్ అసోసియేషన్ భవన నిర్మాత, దివంగత సీనియర్ న్యాయవాది తెలిదేవర సుబ్బారావు (ఎస్ఆర్టీ) పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బార్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు పిల్లి మురళి మోహన వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఎస్ఆర్టీ జూనియర్ న్యాయవాదుల నాయకుడు సాలగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఎస్ఆర్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, సీనియర్ న్యాయవాదులు వీవీఆర్ఎస్ సుబ్రహ్మణ్యం, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మల్లిడి హరినాథ్‌రెడ్డి, బుద్ధవరపు సూర్యనారాయణ, అల్లం గనిరాజు, వాకలపూడి జయశంకర్, కేవీ సత్యవాణి, బొడ్డు వరాహ నరసింహమూర్తి, పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ శర్మ, ఎస్ఆర్టీ జూనియర్ న్యాయవాదులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్డీవో సుధాసాగర్

రామచంద్రపురం: పోలింగ్ సమయంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం పోలింగ్ సమయంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పీవో, ఏపీవోలకు రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.సుధాసాగర్ ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా రామచంద్రపురం పట్టణంలో రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో రామచంద్రపురం, కె.గంగవరం మండలంలోని పీవో, ఏపీవోలకు ఎన్నికలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. సదరు శిక్షణ తరగతుల్లో ఎన్నికలలో పోలింగ్ కేంద్రంల్లో పీవో, ఏపీవోల విధులు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లోను, ఈవీఎంల వద్ద అధికారులు నియమావళిని ఆర్డీవో వివరించారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, రామచంద్రపురం కె.గంగవరం, కాజులూరు మండలాల తహసీల్దార్లు కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుల బృందం స్వామివారిని విశేషంగా అలంకరించారు. అంగరతోబాటు పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మాచర, వెదురుమూడి, తాతపూడి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దూరపు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ, దాతలు ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

వెలగతోడులో ఎమ్మెల్యే అభ్యర్థి తోట ప్రచారం



ప్రచారం అనంతరం నిర్వహించిన సమావేశంలో వేదికపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ నాయకులు

మండపేట: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా రేయింబవళ్లు ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వెలగతోడు గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. నిరుపేదల కోసం మనమంతా జగన్‌ను బలపరచాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, రంపచోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కర్రి పాపారాయుడు మాట్లాడుతూ వచ్చే నెల 13న జరగబోయే ఎన్నికల్లో తోట త్రిమూర్తులును ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ తోటను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ కురుపూడి భవానీరాంబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, పార్టీ రూరల్ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, బూత్ ఇన్‌చార్జ్ పోతుల ప్రసాద్, పార్టీ నాయకులు ఈదర వీరాస్వామి, సాదే పిడుగు రాముడు, తోరం శ్రీనివాస్, చిటికెన వీర్రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మాచర' కళాశాలకు భేషైన ఫలితాలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్ఎం రమాదేవి

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామంలోని ప్రభుత్వ ప్లస్ టు జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ఐదు ప్లస్ టు కళాశాలు ఉన్నాయి. మాచర కళాశాల విద్యార్థులు మేలైన ఫలితాలను సాధించినట్టు హెచ్ఎం రమాదేవి తెలిపారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో 83 శాతం, బైపీసీలో 67 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఎంపీసీలో 1000 మార్కులకు గానూ దంగేటి వైశాలి 812 మార్కులు సాధించిందన్నారు. బైపీసీలో మాకా తులసి దుర్గాభవాని 685 మార్కులు సాధించింది. ఇక ఫస్టియర్ ఎంపీసీలో గాడా ద్రాక్షవల్లి 316 మార్కులు సాధించినట్టు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను తర్ఫీదు ఇచ్చిన పీజీటీలు షిరిషి సాయి, వాడ్రేవు శ్రీనివాస్, ఎస్.వెంకట్, శివశ్రీను, ఉదయ్‌లను హెచ్ఎం రమాదేవి అభినందించారు.

సంక్షేమానికి ప్రజలు పట్టం కట్టాలి



మంజేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్



కాజులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: రాష్ట్రంలో పేద ప్రజలందరికి కుల, మత, పార్టీ, వర్గ విభేదాలు లేకుండా పారదర్శకంగా అర్హులందరకీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని మంజేరులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, కాజులూరులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఇంటింటా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో అధిక సంఖ్యలో స్థానికులు మహిళలు వారిరువురికీ హారతులిచ్చి స్వాగతం పలికారు. మంజేరులో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సీఎం జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరుశాతం అమలు చేయడంతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని సగటున ప్రతి కుటుంబానికీ వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరళా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. కాజులూరులో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలుచేస్తున్నారని పార్టీలు, వర్గ విభేదాలకు తావివ్వకుండా వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికి నేరుగా అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, ఎన్నికల పరిశీలకులు నూతలపాటి శ్రీనివాసరాజు, గ్రామ సర్పంచ్‌లు దండంగి సరోజిని, గుంటూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే సూపర్ సిక్స్

- ప్రజా సంక్షేమంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు
- వైఎస్సార్ సీపీ నేత రెడ్డి రాజబాబు
- 'తోట'కు మద్దతుగా మండపేట 23వ వార్డులో ఎన్నికల ప్రచారం



మండపేట 23వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: ఎన్నికల్లో కేవలం ఓట్లు దండుకోవడానికే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల పేరుతో మేనిఫెస్టో విడుదల చేశారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) అన్నారు. వాస్తవానికి చంద్రబాబుకు ప్రజా సంక్షేమంపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయనన్నారు. వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం పట్టణంలోని 23వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఆ వార్డు కౌన్సిలర్ ముక్కా లోవలక్ష్మి దాలయ్య దంపతుల ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం సాగింది. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, యువ నేత తోట పృథ్వీరాజ్ కూడా ఈ ప్రచారంలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మండపేట అభ్యర్థి తోట త్రిమూర్తులును భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులందరూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో నాయకులు లంక సత్యనారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, నీలం కుమార్, కోన రాము, చిటికిరెడ్డి శ్రీను, బీల రాజు, వడ్డాది సింహాద్రి, సిరిసిపల్లి జానీ, నక్కరాజు వాసు, నక్కరాజు అయ్యప్ప, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, కౌన్సిలర్లు పోతంశెట్టి వరప్రసాద్, నవరపు సతీష్, మలసాని సీతామహాలక్ష్మి, జొన్నపల్లి విజయలక్ష్మి, పిల్లి శ్రీనివాస్, సొసైటీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్‌కు లోబడి నడుచుకోవాలి

మండపేట: ఆదివారం నాడు బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించే వారు ఎన్నికల కోడ్‌కు లోబడి వ్యవహరించాలని మండపేట టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి సూచించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్‌లు అమలులో ఉన్నందున ఎక్కడా ర్యాలీలు నిర్వహించరాదని, డీజేలు పెట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి బైక్ సైలెన్సర్లు తీసి రోడ్డు మీదకి వచ్చినా, ట్రిపుల్ రైడింగ్‌లు చేస్తూ ర్యాలీలు నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు మండపేట మండల పరిషత్ సమావేశం

మండపేట: మండపేట మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆమె కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమావేశంలో కొత్త నిర్ణయాలు గాని, ప్రకటనలు గానీ చేయకూడదని విజ్ఞప్తి చేశారు.

రాములోరి కల్యాణానికి రాట ముహూర్తం



ద్రాక్షారామ శుక్రవారంపేటలో రాములోరి కల్యాణానికి రాట ముహూర్తం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శుక్రవారంపేటలో వేంచేసిన కోదండ రామస్వామి ఆలయం వద్ద స్వామి కల్యాణ వేడుకకు ఆలయ రాట ముహూర్తం నిర్వహించారు. కోదండ రామస్వామి బాల భక్త సమాజం సభ్యులు మాట్లాడుతూ 5 రోజుల పాటు నిర్వహించే రాములోరి కల్యాణ వేడుకల్లో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.